నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 2 అక్టోబర్ 2024 | HYDERABAD



బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో గోడు వెల్లబోసుకుంటున్న మూసీ బాధితురాలు



చాదర్‌ఘాట్‌లోని శంకర్‌నగర్‌లో ఇండ్లు కూల్చివేస్తున్న కూలీలు



- ఇండ్లు కూల్చేందుకు వచ్చే అధికారులను చెప్పలు, చీపురులతో అడ్డుకోవాలి
- అంబర్‌పేటలో మూసీ బాధితులకు బీఆర్‌ఎస్ భరోసా సమావేశం
- భారీగా హాజరైన మూసీ పరీవాహక వాసులు
- ఎదురు తిరగాల్సిందేనని వెల్లడి
- బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ భరోసా సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## మూసీ అభివృద్ధి పేరిట..

# కాంగ్రెస్ లూటీ

### గరీబోళ్ల పాలిట గద్ద రేవంత్: కేటీఆర్




సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) : యాభై ఏండ్ల నుంచి ఉంటున్న ఇండ్లను కూల్చేందుకు వస్తున్న రేవంత్ రెడ్డి... పేదల పాలిట గద్దలెక్క మారిండని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. రిజిస్ట్రేషన్ ఫీజులు, గరీ పట్టీలు కట్టుకుంటూ, కూలీనాలీ చేసుకుంటూ బతుకీడుస్తున్న ఎంతో మంది పేదల జీవితాలను మూసీలో కలిపేందుకు ఇందిరమ్మ రాజ్యం సిద్ధమైందన్నారు. ఇప్పటికే ఇంటింటికీ ఎర్ర రంగు పూసిన కాంగ్రెస్... వాటిని కూల్చడమే తరువాయి అన్నట్లుగా నక్కలా ఎదురు చూస్తున్నదని ఎద్దేవా చేశారు. బస్తీల్లోకి వచ్చే బుల్డోజర్లను అడ్డుకుని పేదల ఇండ్లకు అడ్డుగా బీఆర్‌ఎస్ నిలుస్తుందని అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని న్యూ అంబేద్కర్ నగర్, న్యూ తులసీరాం నగర్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. ఇండ్లపైకి వచ్చే అధికారులను చెప్పులు, చీపుర్లతో అడ్డుకోవాలని, బుల్డోజర్లను అడ్డుకొని ఇండ్లను కాపాడుకోవాలన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి... సీఎం కాగానే హైదరాబాద్ వాసులపై పగబట్టినట్లు వ్యవహరిస్తున్నాడని అసహనం వ్యక్తం చేశారు. మూసీ డెవలప్‌మెంట్ పేరిట లక్షన్నర కోట్ల ఖజానాకు గండికొట్టి... పేదల ఇండ్లను మూసీలో కలిపే కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. పండుగ పూట హైదరాబాద్ వాసులను హైడ్రా పేరిట భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. మూసీమే లూటో... ఢిల్లీమే బాటో పేరిట లక్షన్నర కోట్లతో బ్యూటిఫికేషన్ చేస్తామంటున్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్లు కట్టిస్తానని చెప్పి.. మల్లయ్య ఇంటిని కూలగొట్టి మాల్ కడితే ఏం వస్తుందన్నారు. ఇక్కడున్నవన్నింటినీ బొందల గడ్డలు చేసి, రిసార్టులు, మల్టీప్లెక్సులను కడితే ఒరిగేదేమిటనీ ప్రశ్నించారు. ఇక దేవుని పేరిట ఓట్లు అడిగి, పదవులు అనుభవిస్తున్నా కిషన్ రెడ్డి... ఇబ్బందుల్లో ఉన్న పేదల పక్షాన ఎందుకు నిలవడం లేదన్నారు. రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి కలిసి పేదలను పీక్కుతినేలా ఉన్నారని అసహనం వ్యక్తం చేశారు.

#### మొగోనివైతే ఆరు గ్యారంటీలు అమలు చెయ్!

ఇళ్లు ఖాళీ చేయించి భయభ్రాంతులకు గురి చేసేలా సైదాబాద్ శంకర్‌నగర్‌లో బుల్డోజర్లు తీసుకెళ్తున్న రేవంత్ రెడ్డి.. మొగోనివైతే ఆరు గ్యారంటీలు నెరవేర్చి, బీఆర్‌ఎస్ కట్టిన లక్ష ఇండ్లకు ధీటుగా రెండు లక్షల డబుల్ ఇండ్లు కట్టాలని సవాల్ విసిరారు. పేదలను రోడ్డున పడేస్తానంటే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడూ రూ. 16వేల కోట్లతో మూసీ ప్రక్షాళనకు ప్రణాళికలు రూపొందించామని గుర్తు చేశారు. కానీ ప్రాజెక్టు కారణంగా ఎంతో మంది పేదలు నిరాశ్రయులు అవుతారనే కారణంతో అప్పటి సీఎం కేసీఆర్ ప్రాజెక్టును పక్కన పెట్టేయమని సూచించారు. మూసీలో కలుస్తున్న వ్యర్థాలను నిలువరించేలా వంద శాతం డ్రైనేజీ శుద్ధికి రూ. 4500 కోట్లతో ఎస్టీపీలను నిర్మించామన్నారు. దీంతోనైనా కాలుష్య తీవ్రత తగ్గించామన్నారు. మూసీ ప్రక్షాళన పేరిట కాంగ్రెస్ చేస్తున్న లూటీని అడ్డుకునేందుకు న్యాయపోరాటం చేస్తామని, పేదల పక్షాన నిలిచి ఇండ్లను కాపాడుతామన్నారు.

#### గరీబోళ్లపై జులుం వద్దు..




గరీబోళ్లపై జులుం చేస్తే పోలీసులు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. పోలీసు ఉన్నతాధికారులు చెప్పారని, ప్రభుత్వ పెద్దలు ఆదేశించారనే మాటలతో పేదలను అడ్డుకునే క్రమంలో కేసులు, వేధింపులకు పాల్పడితే.. మిత్తితో కలిపి చెల్లిస్తామన్నారు. అనంతరం అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లపై మార్కింగ్ చేసి మూసీ పేరిట ఇండ్లను కూల్చివేసేందుకు సిద్ధమైందన్నారు. ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నదని... గడిచిన 15రోజులుగా నిద్రాహారాలు మాని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటున్నారని తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ అన్ని అనుమతులు, కరెంట్ చార్జీలు కడుతున్నారని తెలిపారు. ఇటీవల జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కలిసినప్పుడు కూడా అంబర్‌పేటలో మూసీ పరీవాహక ప్రాంతంలో ఎలాంటి కబ్జాలు లేవని గుర్తు చేసినట్లు కాలేరు వెల్లడించారు. మూసీ డెవలప్‌మెంట్ పేరిట ఏం చేస్తావో ముందుగా సీఎం రేవంత్ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి, బాల్క సుమన్, కార్తీక్ రెడ్డితోపాటు బీఆర్‌ఎస్ నేతలు, నాయకులు హాజరయ్యారు.

(వివరాలు IVవ పేజీలో)

# కూల్చివేతలు షురూ

## 150 ఇండ్లు నేలమట్టం

- బలవంతంగా తరలిస్తున్నారని సైదాబాద్ నిర్వాసితుల ఆగ్రహం
- కన్నీటి పర్యంతమైన బాధితులు
- కూల్చొద్దని ప్రాధేయపడ్డ చిన్నారులు



సామగ్రిని తరలిస్తున్న బాధితులు

**కూల్చివేతలు చేయబోమంటూనే అధికారులు మూసీ పరీవాహక ప్రాంతాల్లో నిర్వాసితుల ఇండ్లను మంగళవారం కూల్చేశారు. సైదాబాద్‌లో ఉద్రిక్తతల మధ్య రెడ్ మార్క్ చేసిన ఇండ్లను నేలమట్టం చేశారు. గల్లీలు చిన్నవి కావడంతో బుల్డోజర్లు, జేసీబీలు వెళ్లలేకపోవడంతో 50 మంది లేబర్లను రంగంలోకి దించారు. వాళ్లంతా సుత్తెలు, గడ్డపారలు తదితర సామగ్రిని ఉపయోగించి గోడలు, కప్పలను భూస్థాపితం చేశారు.**

- సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) :

**తమ కండ్ల ముందే** ఇండ్లు కూలిపోవడం చూసిన బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. కూల్చొద్దు సారూ అంటూ వేడుకున్నారు. తమ సామగ్రిని తీసుకోవడానికి సమయం ఇవ్వాలని కొందరు అధికారులకు విజ్ఞప్తి చేశారు. కూలుతున్న ఇంటిలో నుంచి సామగ్రి తీసుకుంటున్న దృశ్యాలు ప్రతి ఒక్కరిని కదిలించాయి. చిన్నారులు సైతం వారి వస్తువులను తీసుకుంటూ మా ఇంటిని కూల్చొద్దంటూ అధికారుల వద్ద ప్రాధేయపడ్డారు. కాగా, బాధితుల అరణ్య రోదన పట్టించుకోని రేవంత్ సర్కార్ కూల్చివేతలను ప్రారంభించి నిర్వాసితుల్లో భయం నింపారు. అడుగడుగునా బాధితులు అడ్డుకునే ప్రయత్నం చేసినా.. పోలీసుల పహారాలో ఇండ్లను భూస్థాపితం చేశారు. సైదాబాద్ మండలం మూసీ పరీవాహక ప్రాంతంలో 150 ఇండ్లను అధికారులు నేలమట్టం చేశారు. ఇప్పటి వరకు అధికారులు 1595 నిర్మాణాలను రివర్‌బెడ్‌లో గుర్తించారు. ఇందులో 940 ఇండ్లకు ఆర్‌బీ ఎక్స్ మార్క్ చేసినట్టు ఆర్డీఓ మహిపాల్ తెలిపారు. కాగా, శంకర్‌నగర్‌లోని మూసీ రివర్ బెడ్‌లో భారీ పోలీస్ బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారులు చేపట్టిన కూల్చివేతలు సైతం తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి. షేక్‌పేట తాసీల్దార్ అనితారెడ్డి, హిమాయత్‌నగర్ తాసీల్దార్ సంధ్యారాణి, వెస్ట్ మారేడ్‌పల్లి తాసీల్దార్ బీమయ్యగౌడ్‌ల ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు.

(వివరాలు IVవ పేజీలో)



ఫర్నీచర్‌ను తరలిస్తున్న నిర్వాసితులు



శంకర్‌నగర్‌లో కూల్చివేతలు.. దీనంగా చూస్తున్న బాధితులు

# హైదరాబాద్‌లో డీజే బంద్!

### ఉత్తర్వులు జారీ చేసిన సీపీ ఆనంద్



సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): దుర్గా నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులకు హైదరాబాద్ పోలీసులు షాకిచ్చారు. ఇకపై నగరంలో పెళ్లి బారాత్‌లు, రాజకీయ ర్యాలీలు, మతపరమైన వేడుకలు.. ఇలా ఏ కార్యక్రమమైనా డీజే వినిపించొద్దు. టపాసులు పేల్చుడు కనిపించొద్దు.. డీజేలు, ఫైర్ క్రాకర్స్‌పై నిషేధం విధిస్తూ సీపీ ఆనంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నాలుగురోజుల క్రితం సీపీ ఆనంద్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. అన్ని పార్టీల ప్రతినిధులు, మతపెద్దలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. దసరా సమయంలో సిటీలో ఇప్పుడు పాట వినిపించదు.. క్రాకర్స్ పేలుళ్లు వినిపించవు. డయల్ 100కు వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా అందరితో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీపీ వెల్లడించారు. భారీ శబ్దాలతో డీజేలు పెట్టి సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారన్న ఫిర్యాదులతో ఈ మార్గదర్శకాలు జారీ చేశారు.

#### పలు నిషేధాజ్ఞలు..

డీజే, సౌండ్ మిక్సర్, హైసౌండ్ ఎక్విప్‌మెంట్ పరికరాలపై నిషేధం విధిస్తున్నట్లు కమిషనర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నాలుగు జోన్లలో సౌండ్ సిస్టమ్‌లు పెట్టడానికి డెసిబుల్స్‌ను నిర్దేశిస్తూ మార్గదర్శకాలు జారీ చేశారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ నిషేధం అమలులో ఉంటుందన్నారు. అనుమతి ఉన్న ప్రాంతాల్లో తక్కువ శబ్దంతో అనుమతి ఇచ్చారు. జనావాసాల్లో ఉదయం 55 డెసిబుల్స్, రాత్రి 45 డెసిబుల్స్ సౌండ్స్ మించరాదన్నారు. ఆసుపత్రులు, స్కూళ్లు, కాలేజీలు, కోర్టు ప్రాంగణాలకు వంద మీటర్ల దూరంలో నిషేధం ఉంటుందని తెలిపారు. మతపరమైన ర్యాలీల్లో బాణాసంచా కాల్చడం పూర్తిగా నిషేధిస్తున్నామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# బతుకే పోయింది.. బతుకమ్మ ఎట్ల?

**మాదాపూర్ సున్నం చెరువులోని** ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను గత నెల 8న హైడ్రా బుల్డోజర్లతో కూల్చివేసింది. కనీసం ముందస్తు నోటీసులు సమాచారం ఇవ్వకుండా, ఇంట్లోని సామగ్రి తీసుకోకుండా వర్షం పడుతున్న సమయంలో కట్టుబట్టలతో బయటకు పంపి కూల్చివేతలు చేపట్టింది. దీంతో వారు నిరాశ్రయులయ్యారు. ఎక్కడికి పోవాలో తెలియక అక్కడే కూల్చివేతల శిథిలాల మధ్యే బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్నారు. బాధితులలో ఎవరిని కదిలించినా మా బతుకే ఆగమైంది.. ఇక బతుకమ్మ పండుగ ఎట్ల జరుపుకోవాలి అని కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇల్లులేక.. పైసలు లేక.. పనులకు పోదామంటే పనులు దొరక్క అంతా ఆగమైపోయిందని బాధిత మహిళలంతా బోరుమన్నారు. రేవంత్ సర్కార్ కారణంగా ఈ యేడాది తమ జీవితంలో బతుకమ్మ పండుగే లేకుండా పోయిందని బాధపడుతున్నారు. ఇది సున్నం చెరువు కూల్చివేతలలో ఇళ్లు కోల్పోయి సర్వస్వం పోగొట్టుకొని రోడ్డు పాలైన బాధితులందరి ఆవేదన. -సిటీబ్యూరో, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ) (వివరాలు IVవ పేజీలో)

# పట్టాలు ఇచ్చి.. వసతులు మరిచి!

## డబుల్ ఇండ్లలో నీళ్లు లేవు.. కరెంట్ రాదు!

- జిల్లాలో ఇప్పటి వరకు 163 డబుల్ ఇండ్లు కేటాయింపు
- వసతులు ఏర్పాటు చేయకుండానే ఇండ్లలోకి తరుముతున్న అధికారులు
- నిర్వాసితుల ఆగ్రహం



జియాగూడ డబుల్ బెడ్‌రూం భవనం

సిటీబ్యూరో/కార్వాన్, అక్టోబర్1 (నమస్తే తెలంగాణ) : మూసీ నిర్వాసితుల ఇండ్లను కూల్చడానికి రేవంత్ సర్కార్ మొదట్నుంచి ప్రణాళికలు వేసింది. మరి ఆ నిర్మాణాలను కూల్చితే నిర్వాసితుల బతుకులు ఏం గావాలే అనే విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. వారికి డబుల్ బెడ్ రూంలు కేటాయించాలనుకుంటే అందులో అవసరమైన అన్నీ వసతులు ఉన్నాయా? లేవా? అని పరిశీలించి అందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ కేవలం కూల్చివేతలే లక్ష్యంగా అభాగ్యుల బతుకు బుగ్గిపాలు చేస్తున్నది. ఇష్టమొచ్చినట్టు కొందరిని బెదిరించి డబుల్ బెడ్ రూంలకు బలవంతంగా తరలిస్తున్నారు. ఉన్న ఇల్లును వదిలేసి ఆ డబుల్ బెడ్ రూంలో అడుగుపెడితే సమస్యలే ఆహ్వానం పలుకుతున్నట్టుగా అందులోని పరిస్థితులు ఉన్నాయని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ''కరెంట్ రావడం లేదు. నీళ్లు బంద్ అయినయ్. ఎవ్వరిని అడగాలో తెలియదు. లిఫ్ట్ పనిచేయడం లేదు. ఆపరేషన్ చేసుకున్న వారు, వృద్ధులూ ఉన్నారు. వారికి 6, 7 అంతస్తుల్లో

(మిగతా IVవ పేజీలో)